



# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY





PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శుక్రవారం 08-03-2024 సంపుటి : 06 సంచిక : 178 పేజీలు : 8 వెల : రూ 3-00

# ఎన్నికల వేళ జగన్ సర్కార్ కీలక నిర్ణయం

**విద్యా,వైద్య శాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజ్ ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం**

అమరావతి,మార్చి7( : ఎన్నికల వేళ జగన్ సర్కార్ కీలక నిర్ణయాలు తీసుకుంటుంది. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో అమలు చేయని వాటిపై దృష్టి పెట్టింది. అప్పట్లో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు సిద్ధమవుతోంది. ఈ క్రమంలో కాంట్రాక్ట్ ఉద్యోగులకు జగన్ ప్రభుత్వం శుభవార్త అందించింది. విద్య, వైద్యశాఖలోని కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యూలరైజ్ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు దీనికి సంబంధించిన ఉత్తర్వులను కూడా జారీ చేసింది. ఈ నిర్ణయంతో 2014 కంటే ముందు నుంచి వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు పర్మినెంట్ కానున్నారు. 2014 కంటే ముందు నుంచి ఈ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు దాదాపు 2146 మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరందరినీ రెగ్యూలరైజ్ చేశారు. దీనికి సంబంధించి వైద్యశాఖ స్పెషల్ సీఎస్ కృష్ణబాబు ఇవాళ జీవో జారీ చేశారు.మొత్తం 2146 కాంట్రాక్ట్ ఉద్యోగుల్లో పబ్లిక్ హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌లో 2025 మంది పని చేస్తుండగా.. డీఎంఈ పరిధిలో 66 మంది సేవలు అందిస్తున్నారు. ఇక కుటుంబ సంక్షేమ డిపార్ట్‌మెంట్‌లో 55, ఆయుష్, యునాని విభాగంలో 4 కాంట్రాక్ట్ ఉద్యోగుల పనిచేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో వీరి ఉద్యోగాలు పర్మినెంట్ అయ్యాయి. 2019 ఎన్నికలకు ముందు పాదయాత్ర సమయంలో తాము అధికారంలోకి వస్తే కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామంటూ జగన్ హామీ ఇచ్చారు. ఆ హామీని నెరవేర్చాలని కాంట్రాక్ట్ ఉద్యోగులు ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్నారు. కానీ ఇప్పుడు ఎన్నికల వేళ వారికి ఇచ్చిన హామీని జగన్ నెరవేర్చారు. జగన్ ప్రభుత్వం నిర్ణయం పట్ల కాంట్రాక్ట్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తమకు ఇచ్చిన హామీని నెరవేర్చినందుకు సంతోషంగా ఉందని చెబుతున్నారు. జగన్ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ ఆఫీసుల్లో పనిచేసే కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించారు. రాష్ట్రవ్యాప్తంగా గవర్నమెంట్ ఆఫీసుల్లో దాదాపు 10,117 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీళ్లు కూడా తమను రెగ్యూలరేజ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# వైఎస్సార్ చేయూత 97,254 మందికి .182.35 కోట్లు జమ

**జిల్లా కలెక్టర్ డా. కె.శ్రీనివాసులు**

--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 07-వైఎస్సార్ చేయూత పథకం కింద జిల్లాలో 97,254 అక్క చెల్లెమ్మలకు వరుసగా నాలుగో విడత ఆర్థిక సాయంగా రూ.182.35 కోట్లు జమ చేసామని జిల్లా కలెక్టర్ డా. కె.శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం అనకాపల్లి జిల్లా, కశింకోట మండలం, పిసినికాడ గ్రామం నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి వైఎస్సార్ చేయూత పథకం ద్వారా రాష్ట్రంలోని 26,98,931 మంది అక్క చెల్లెమ్మలకు వరుసగా నాలుగో విడత ఆర్థిక సాయంగా రూ.5,060.49 కోట్ల రూపాయల నగదు మొత్తాన్ని బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసే కార్యక్రమాన్ని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లా కలెక్టర్ డా. కె శ్రీనివాసులు, ప్రభుత్వ మైనార్టీ సలహా దారులు హాబీబుల్లా, రాష్ట్ర హస్తకళల డైరెక్టర్ సునీత అమృత్ రాజ్, బెస్త సంక్షేమ సంఘం డైరెక్టర్ చంద్రశేఖర్, ఏపీఎస్పీడిఎల్ డైరెక్టర్ శశికళ రెడ్డి, డిఆర్డిఎ శ్రీధర్ రెడ్డి, లబ్దిదారులు పాల్గొని వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు మాట్లాడుతూ వైఎస్సార్ చేయూత పథకం ద్వారా 4వ విడత ద్వారా జిల్లా వ్యాప్తంగా 97,254 మంది అక్క చెలెమ్మలకు రూ.182.35 కొట్లు జమ చేశామన్నారు, ప్రభుత్వం అందిస్తోన్న వైఎస్సార్ చేయూత పథకం ఆర్థిక సహాయాన్ని అక్క చెల్లెమ్మలు చక్కగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇదే కాక ఆసక్తి కనబరిచిన అక్కా చెల్లెమ్మలకు సాంకేతిక, బ్యాంకింగ్, మార్కెటింగ్ కంపెనీలతో



టైఅప్ ద్వారా సహకారం అందించడం కూడా జరుగుతుందన్నారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా మార్చి 7 నుండి 14 రోజుల పాటు పండగ వాతావరణంలో వైఎస్సార్ చేయూత కార్యక్రమం జరుగుతుందన్నారు.అలాగే నంద్యాల జిల్లాలో 97,254 మంది లబ్ధిదారులకు రూ.183.45 కోట్లు జమ చేశామన్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 15,404 మంది లబ్ధిదారులకు రు.28.88 కోట్లు, బనగానపల్లిలో 16,435 మందికి రు.30.82 కోట్లు, డోన్ లో 15,166 మందికి రు.28.44 కోట్లు, నందికొట్కూర్ 17,055 మందికి రు.31.98 కోట్లు, నంద్యాలలో 14,308 మందికి రు.26.83 కోట్లు, పాణ్యంలో 5,573 మందికి రు.10.45 కోట్లు, శ్రీశైలంలో 13,313 మందికి రు.24.96 కోట్లు వెరసి మొత్తం 97,254 మంది లబ్ధిదారులకు రూ.182.35 కోట్లు రూపాయలు నేరుగా జమ చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.ఆనంతరం జిల్లా కలెక్టర్ డా. కె శ్రీనివాసులు, ప్రభుత్వ మైనార్టీ సలహా దారులు హాబీబుల్లా,రాష్ట్ర హస్తకళల డైరెక్టర్ సునీత అమృత్ రాజ్, బెస్త సంఘము డైరెక్టర్ చంద్రశేఖర్, ఏపీఎస్పీ డిఎల్ డైరెక్టర్ శశికళ రెడ్డి,డిఆర్డిఎ శ్రీధర్ రెడ్డి,తదితరులు లబ్ధిదారులకు చెక్కును అందజేశారు.





# కాంగ్రెస్ పార్టీని గెలిపించడమే ధ్యేయం

**బిజెపి పార్టీని ఓడించడమే లక్ష్యం**
**దశ దిశ నిర్దేశించిన పిసిసి చీఫ్ వైఎస్ షర్మిలారెడ్డి**






కర్నూల్ మార్చి 7:రానున్న 2024 సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించండి ధ్యేయంగా నాయకులు కార్యకర్తలు ముందుకు దూసుకెళ్లాలని పిసిసి చీఫ్ శ్రీ మతి వైయస్ షర్మిల రెడ్డి గారు నాయకులకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురువారం విజయవాడలోని సీకే కన్వెన్షన్ హాల్ లో న్యాయ సాధన ప్రతిజ్ఞ కార్యక్రమం జరిగింది. మాజీ ఏపీ పీ సి సి చీఫ్ గిడుగు రుద్రరాజు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీమతి వైయస్ షర్మిల రెడ్డి గారు మాట్లాడుతూ రాష్ట్రం కోసం పోరాడే నాయకుడు లేకపోవడం దురదృష్టకరమన్నారు. ఐదు సంవత్సరాలు చంద్రబాబు 5 సంవత్సరాలు వైయస్ జగన్మోహన్ రెడ్డి బిజెపి పార్టీకి ఊడిగం చేస్తున్నారన్నారు. బిజెపికి తొత్తుగా వ్యవహరిస్తూ రాష్ట్ర ప్రజలను బిజెపికి బానిసలుగా చేస్తున్నారని ధిక్కార స్వరంతో ఆవేదన వ్యక్తం చేస్తూ కన్నీటి పర్వంతమయ్యారు. రాష్ట్రంలో బిజెపికి ఒక ఎమ్మెల్యే ఒక ఎంపీ సీటు లేకుండా రాష్ట్రాన్ని పాలించడం దేశంలో ఎక్కడైనా ఉందా అని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రయోజనాలను పక్కనపెట్టిన చంద్రబాబు పవన్ కళ్యాణ్ జగన్మోహన్ రెడ్డిలు రాష్ట్రానికి తీరని ద్రోహం చేశారని ఆరోపించారు. దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి కలలుగన్న ప్రాజెక్టులు ఒక్కటి కూడా ముందుకు సాగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రత్యేక హోదా ఏపీకి ప్రాణం లాంటిది : అలాంటి ప్రత్యేక హోదాను పక్కనపెట్టి స్వార్థ ప్రయోజనాల కోసం బిజెపి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ముందు సాష్టాంగ నమస్కారం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ, రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు అంశాలను కాంగ్రెస్ పార్టీ భుజాన వేసుకుందన్నారు. వీటిని సాధించేదాకా కాంగ్రెస్ పార్టీ నిద్రపోదని రానున్న 2024 సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి తీరుతుందని చెప్పారు.జై భీమ్ నినాదాన్ని అందుకున్న షర్మిల రెడ్డి:కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి తీసుకురావడానికి అందుకోవడమే కాకుండా అట్టడుగు అణగారిన ప్రజలకు అండగా ఉంటామన్న భరోసానిచ్చారు. అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు నడుం బిగించాలని పిలుపునిచ్చారు.ముఖాముఖి కార్యక్రమంలో కర్నూలు జిల్లా నాయకులు:కర్నూలు జిల్లా నుంచి డిసిసి అధ్యక్షులు శ్రీ కే బాబురావు గారి ఆధ్వర్యంలో పార్లమెంట్ అభ్యర్థులు, అసెంబ్లీ అభ్యర్థులు ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందు కర్నూల్ పార్లమెంటు అభ్యర్థిత్వాన్ని ఆశించే ఆశావాహులతో ముఖాముఖి నిర్వహించారు. దాదాపు తొమ్మిది మంది పార్లమెంట్ ఆశవాహకులు ముఖాముఖిలో పాల్గొన్నారు. అలాగే అన్ని నియోజకవర్గాల నుంచి ఆశావాలు ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని వైయస్ షర్మిలమ్మ అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ఇందులో భాగంగానే 2024 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం క్షేత్రస్థాయిలో పనిచేయాలని ఆశవాహులకు దిశ నిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఏపీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలి గారు, మాజీ కేంద్రమంత్రి జెడి శీలం, చింతా మోహన్ తదితరులు హాజరయ్యారు.కర్నూలు జిల్లా డిసిసి అధ్యక్షులు శ్రీ కే బాబురావు తో పాటు ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు బతకన్న గారు, డిసిసి ప్రధాన కార్యదర్శి, సత్యనారాయణ గుప్త, అధికార ప్రతినిధి బి చిన్న రామాంజనేయులు, ఆత్మకూరు బాలన్న, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఈ లాజరస్, మహిళా జిల్లా అధ్యక్షురాలు ఎస్ ప్రమిల, ఓబిసి చైర్మన్ వెంకట్ రాముడు, అడ్మినిస్ట్రేషన్ కార్యదర్శి భరత్ కుమార్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ మహానందీశ్వరస్వామి వారి దేవస్థానము

మహానంది - నంద్యాల జిల్లా

**2024 మహా శివరాత్రి బ్రహ్మోత్సవముల ఆహ్వానము**



2024-మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవములు తేది:06.03.2024 నుండి 10.03.2024 వరకు అత్యంత వైభవముగా జరుగును.

**కార్యక్రమము వివరములు**

| తేది: & వారము | ఉదయం | సాయంత్రం | రాత్రి |
|---|---|---|---|
| 06-03-2024 బుధ వారం | | ధ్వజారోహణం | మయూర వాహన సేవ |
| 07-03-2024 గురు వారము | శేష వాహన సేవ | | వ్యాఘ్ర వాహన సేవ |
| 08-03-2024 శుక్ర వారము మంగళ వారం | సింహ వాహన సేవ | | వృషభ వాహన సేవ |
| మహాశివరాత్రి : | రాత్రి గం.10:00ల నుండి లింగోద్భవ కాల మహారుద్రాభిషేకము<br>రాత్రి గం.3:00ల నుండి శ్రీ స్వామి వార్ల కళ్యాణ మహోత్సవము | | |
| 09-03-2024 శని వారం | అశ్వ వాహన సేవ | | పుష్ప పల్లకి సేవ |
| 10-03-2024 ఆది వారం | రావణ వాహన సేవ | రథోత్సవము | పుష్పశయనోత్సవము |
| 11-03-2024 సోమ వారం | మహాపూర్ణాహుతి & నాగబలి పూజ | త్రిశూల స్నానము ధ్వజ అవరోహణం | తెప్పోత్సవం |

కావున భక్తులు లక్షలాదిగా తరలి వచ్చి శివరాత్రి బ్రహ్మోత్సవములను ప్రత్యక్షముగా వీక్షించి సకల ఐశ్వర్యములను పొందగలరని కోరుచున్నాము. మరియు దేవస్థానము నందు నిర్మించబోవు వసతి గదులు, కాటేజీలు నిర్మించుటకు మరియు దేవస్థానము నందలి నిత్యాన్నదాన పథకమునకుగాను మహోన్నత మహారాజ పోషకులు రూ.1,00,116/- మహారాజ పోషకులు రూ.51,116/-, రాజ పోషకులు రూ.25,116/-, పోషకులు రూ.5,116/- విరాళములుగా చెల్లించి శ్రీ స్వామి అమ్మవార్ల అనుగ్రహమునకు పాత్రులు కావలసినదిగా కోరుచున్నాము.



కె.చంద్రశేఖర్ రెడ్డి
కార్యనిర్వహణాధికారి

# సంపాదకీయం

శుక్రవారం 08-03-2024

## మహిళాభ్యుదయం మన సంకల్పం కావాలి

ఏటా మహిళా సదస్సుల..మహిళల గురించి గొప్పగా చెప్పుకుంటున్నా వారి అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలు ముందుకు సాగడం లేదు. బేటీపడావో..బేటీ బచావో నినాదంగా మారింది. ఆడపిల్లల చదువులకు, క్రీడలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఏవీ అమలు కావడం లేదు.ఆడపిల్లల చదువులకు ప్రత్యేక రుణాలు, వడ్డీలేని పథకాలు అమలుచేసివుంటే బాగుండేది. ఉద్యోగాలు లేవు. చదువుకునే మహిళలకు కనసీం ఫ్రీ చదువులు లేవు. విద్యా రుణాలు తీసుకుంటే కనీసం వడ్డీ మాఫీ గురించి కూడా ఆలోచన చేయడం లేదు. అలాచేసివుంటే బేటీపడావో..బేటీ బచావోకు అర్థం ఉండేది. మహిళలను గౌరవిస్తున్న మనదేశంలో మహిళల కోసం ఏం చేశారంటూ ఏమీ లేదు.ఓ గిరిజన మహిళను రాష్ట్రపతిగా చేయడం మాత్రం అభినందించాల్సిందే. ఘనత వహించిన మోడీకి ఇవన్నీ తెలియనివి కాదు. జీఎస్టీ రాబుడులను ఎలా పెంచాలన్న ఆలోచన తప్ప ఇలాంటి విషయాల్లో చిత్తశుద్ధి లేదు. ఆర్థిక మంత్రిగా ఓ మహిళ ఉన్నా మహిళలకు ఒనగూరుతున్న ప్రయోజనం లేదు. మహిళా బిల్లుకు సంబంధించి బిల్లు పాస్ యినా అది అప్పుడే అందుబాటులోకి రాలేదు. దానికి మరో ఐదేళు వేచిచూడాల్సి రాక తప్పదు. మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించడంలో అధికార విపక్ష సభ్యులు ఉమ్మడిగా విఫలం అయ్యారు. బిల్లును పాస్ చేసినా అమలు కాకుండా అటకెక్కించారు. ఈ బిల్లుతో రాజకీయ లబ్ది పొందాలన్న బిజెపి ఎత్తుగడ తప్ప వారికి మేలు చేయాలన్న పట్టుదల, చిత్తశుద్ధి మోడీలో లేకుండా పోయింది. ఈ ఎన్నికల్లోనే వారికి రిజర్వేషన్లు అమలయివుంటే బాగుండేది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాలు ఇలా ఏటేటా జరుపుకుం టున్నా...మన నేతల్లో మార్పు రావడం లేదు. చట్టసభల్లో వారికి రావాల్సిన వాటాను కావాలనే ఇంతకాలం అడ్డుకున్నారు. సమాజంలో మహిళలకు ఉన్న అత్యుతన్నస్థాయి గౌరవాన్ని మనమే దిగజార్చుకుంటున్నా పెద్దగా భయపడడం లేదు. బేటీపడావో.. బేటీ బచావో ఓ నినాదంగా మారింది. కనీసం వారి అభిప్రాయా లకు విలువను ఇచ్చినట్లుగా ఉండేది. కానీ అలా జరగలేదు. కేవలం వారికి శుభాకాంక్షలు చెప్పడంతో బడానేతలు తప్పించుకున్నారు. తమ ధర్మాన్ని విస్మరించారు. సమాజం కూడా వారిని ఇంకా విలాసవస్తువుగానే చూస్తున్నది.. అమ్మాయి కనిపిస్తే రేప్ చేయడమే లక్ష్యంగా మృగాళ్లు చెలరేగి పోతున్నారు. అందుకే చట్టసభల్లో వారికి గౌరవం ఇచ్చేలా రిజర్వేషన్ బిల్లును తక్షణం అమలుచేసివుంటే బాగుండేది. పరిస్థితులపై మనమంతా మహిళల హక్కులపై చర్చించాలి. వారి గౌరవానికి భంగం కలిగించే అంశాలపై యుద్ధం చేయాలి. అనేకానేక అవరోధాల మధ్య కూడా తమతమ రంగాలలో శక్తిమంతమైన మహిళగా ఆమె నిరూపించుకుంటూనే ఉంది. వ్యక్తిత్వ హననం జరుగుతున్నా.. సమాజంలో తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకుంటూనే ఉంది. మహిళాభ్యుదయమే దేశాభ్యుదయం అని మనమంతా కీర్తిస్తూ వారిని మభ్య పెడుతున్నామని గుర్తించాలి. మహిళా సమానత్వమే సమాజానికి హితం చెబుతున్న పాలకులు సమాన గౌరవం ఇచ్చి చట్టసభల్లో ప్రవేశించేలా చేయడంలో మాత్రం విఫలం అవుతున్నారు. మహిళల్లో స్ఫూర్తిని నింపడమే గాకుండా, వారిలో ఆత్మస్థయిర్యాన్ని నింపి వారిని మనతో సమానంగా ముందుకు తీసుకుని వెళ్లడంలో పురుష సమాజం విఫలమయ్యిందనడంలో సదేహం లేదు. ఇక దీనిని సవాల్‌గా తీసుకుని మహిళలే తమ హక్కుల కోసం పోరాడాలని గుర్తుంచుకోవాలి. పురుషాహంకార సమాజాన్ని నిలదీయాలి. నిగ్గదీయాలి. తమ హక్కులను సాధించే వరకు పోరాటాన్ని కొనసాగించాలి. భారత రాజకీయాల్లో మహిళలు కీలక భూమిక పోషిస్తున్నా తగినంతగా ప్రోత్సాహం మాత్రం దక్కడం లేదు. అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలను ఎందుకనో రాజకీయంగా ముందుకు సాకుండా అణగదొక్కుతున్నారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కారణంగా ఎందరో మహిళలు తమ సత్తా చాటుతున్నారు. అసెంబ్లీ,పార్లమెంటుల్లో మాత్రం రిజర్వేషన్ల దక్కితేనే మరింతగా రాణిస్తారు.వారిని అణచి వేయడం వల్ల 50శాతం జనాభా ఆకాంక్షలను కాలరాస్తున్న వారం అవుతున్నాం. మహిళా సాధికారతతో ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా పాలన సాగాలి. అన్నిరంగాల్లో మహిళలకు సముచిత భాగస్వామ్యం కల్పించి నప్పుడే సామాజిక ప్రగతి సాధ్యపడుతుంది. అలాగే చదువుకునే అమ్మాయిలకు ఉచిత విద్యా రుణాలు అందాలి. అలాగే వారి ఉన్నత విద్యాకు ప్రభుత్వాలు చేయూత నివ్వాలి. బేటీపడావో ..బేటీ బచావో నినాదం కార్యరూపం దాల్చాలి.మహిళలను విలాసవస్తువుగా చూసే సంస్కృతిపై కఠినంగా వ్యవహరించాలి. అత్యాచారాలు, వేధింపులపై కఠినంగా వ్యవహరించేలా చట్టాలు రావాలి. ప్రజాస్వామ్యంలో కేవలం అధికార పక్షమే కాదు ప్రతిపక్షాలకూ, ప్రజలందరికీ పాత్ర ఉంటుంది. ఇది గమనించి అందరూ ముందుకు సాగాలి. మహిళల గొప్పతనాన్ని భారతీయ మహిళల ఆదర్శాలను ప్రముఖంగా ప్రస్తావించిన మన సంస్కృతిని ముందుకు తీసుకుని వెళ్లే క్రమంలో సమాజం వారిపట్ల గౌరవభావంతో సాగాలి. విద్యా,క్రీడా, సాంస్కృతిక రంగాల్లో వారిని ముందుకు నడిపించేలా నిర్ణయాలు తీసుకుని ముందుకు సాగాలి. అప్పుడే మనం ఆశించిన మహిళాభ్యుదయం సాకారం అవుతుంది.

# కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బరిలో... గార్లపాటి



విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- మార్చి 7 రాష్ట్రవ్యాప్తంగా వివిధ పార్లమెంట్ మరియు అసెంబ్లీ నియోజకవర్గాలకు కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేయడానికి అప్లై చేసుకున్న అభ్యర్థులతో గురువారం విజయవాడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నంద్యాల పార్లమెంటులోని డోన్ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా తమ పేరును పరిశీలించాలని చిన్న మల్కాపురం గ్రామానికి చెందిన డాక్టర్ గార్లపాటి మద్దిలేటి స్వామి అభ్యర్థిత్వాన్ని పరిశీలన చేయవలసిందిగా ఆయన కోరడమైనది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో 2006లో చిన్న మల్కాపురం ఎంపీటీసీగా పోటీ చేసి ఓడిపోయినప్పటికీ, మరల 2014లో డోన్ మండల జడ్పిటిసిగా కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి ఓడిపోయినప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని కార్యకర్తగా నంద్యాల పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు జె.లక్ష్మీనరసింహ యాదవ్ సలహా మేరకు నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శిగా మరియు డోన్ నియోజకవర్గం సమన్వయకర్తగా పనిచేస్తూ కాంగ్రెస్ పార్టీని డోన్ నియోజకవర్గంలో వివిధ గ్రామాలలో ఇంటింటికి కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలకు తెలియజేస్తూ, పార్టీ అభివృద్ధికి కృషి చేయడం జరిగింది కావున ఎన్నో సంవత్సరాలుగా సొంత ఖర్చులతో కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తూ,జండా మోసి నీతి నిజాయితీగా పని చేసి,వివిధ కార్యక్రమాలను చేసి ప్రజల్లోకి తీసుకెళ్లిన నా అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని అధ్యక్షుల వారికి విన్నవించుకోవడం జరిగిందని ఆయన అన్నారు.

# పాతపేట హైస్కూల్ లో సరస్వతీ పూజ కార్యక్రమం....





విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- మార్చి 7 డోన్ పట్టణం పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ప్రధానోపాధ్యాయులు పద్మావతమ్మ అధ్యక్షతన 2023-24 నందు పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు సరస్వతీ పూజ కార్యక్రమం నిర్వహించినట్లు వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నెహ్రూ నగర్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సురేష్ బాబు మాట్లాడుతూ విద్యార్థులు పరీక్ష సమయంలో ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలన్నారు. ప్రస్తుత సమాజంలో ఇంటి దగ్గర సెల్ఫోన్ విరివిగా వాడడం వల్ల చదువు పై దృష్టి సారించలేకపోతున్నారని గుర్తు చేశారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని, మంచి ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఉపాధ్యాయులు సబ్జెక్టు వారిగా తగు సూచనలు చేశారు. విద్యార్థులకు హాల్ టికెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు శివప్రసాద్, సుబ్బారెడ్డి, వెంకటరమణ, రవిశేఖర్, వెంకట లక్ష్మి, రాధ, లక్ష్మయ్య,అనంత శ్రీనివాసులు, రఘునాథ్, ఎస్తేరమ్మ, లక్ష్మీకాంతరెడ్డి, మద్దిలేటి, సుబ్బరాయుడు, మధుసూదన్ రెడ్డి, విజయకుమార్, సుభాన్, శ్రీనివాసులు, జయసుబ్బరాయుడు, శివన్న, బాబు, ఆదినారాయణ, సురేష్, లీలావతమ్మ, సంజీవరెడ్డి, రమేష్, దేవేంద్రప్ప, భాను ప్రకాష్ రెడ్డి, భారతి, లక్ష్మీ ప్రభావతి, హుస్సేన్ భాను, మునిరాజు, ప్రసాద్ రావు, రవీంద్ర శర్మ,మహేష్, అల్లిపీరా, తదితరులు పాల్గొన్నారు

# అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు





నంద్యాల జిల్లా డోన్ పట్టణంలోని ఐసిడిఎస్ కేంద్రం లో ఐ సి డిఎస్ సిడిపిఓ శంషాద్ బేగం ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు సివిల్ కోర్టు జడ్జ్ తంగమని, ప్రభుత్వ వైద్యురాలు రమ్య శిల్ప, ఇన్నర్ వీల్ క్లబ్ మాజీ అధ్యక్షురాలు సప్తశైల సుమిత్ర తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల కోసం అంతర్జాతీయ దినోత్సవం కేటాయించడం జరిగింది. మహిళలు అన్ని రంగాలలో ముందంజలో ఉండాలని ఒకరిపై ఆధారపడకుండా స్వశక్తితో ఎదగాలని సివిల్ జడ్జ్ తంగమని అన్నారు. డాక్టర్ రమ్య శిల్ప మాట్లాడుతూ కేంద్రం మహిళలకు సర్వైకల్ క్యాన్సర్ బారిన పడకుండా త్వరలో ఇంజక్షన్లను విడుదల చేయనున్నారు వాటిని మూడు దఫాలుగా వేయించుకొని రోగాల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉండాలని అన్నారు. అలాగే మహిళలు అందరూ ఇన్ఫోసిస్ సీఈఓ సుధామని, భారతదేశ రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము లవలే ఉన్నత స్థాయిలకు ఎదగాలని చెప్పారు. తదనంతరం బేతంచెర్ల మండలానికి చెందిన సీతామహాలక్ష్మి 40 శ్లోకాలను వేగంగా చెప్పి లింక్ ఆఫ్ బుక్ రికార్డులో ఈ సంవత్సరం ఫిబ్రవరి నెలలో స్థానం దక్కించుకున్న సందర్భంగా చిన్నారిని అభినందించి నీళ్లు సరి కిందికి రావడం శ్లోకాలను పాటించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్లు అంగన్వాడి కార్యకర్తలు పాల్గొనడం జరిగింది

# నంద్యాల టౌన్ లో బిజెపి ఇంటింటి ప్రచారం



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 07-కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి పట్టణ ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నట్లు నంద్యాల అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మదు పేర్కొన్నారు. గురువారం భారతీయ జనతా పార్టీ నంద్యాల అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మధు విశ్వ నగర్ లో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. విశ్వనగర్ ఉన్నటువంటి వారి ఇబ్బందులను అభిరుచిమధు వివరించారు. ఈ కార్యక్రమంలో విశ్వనగర్ భారతీయ జనతా పార్టీ లీడర్ ప్రతాప్ గౌడ్ వంశి గౌడ్ భారతీయ జనతా పార్టీ నాయకులు బాలమణి. కృష్ణారెడ్డి.స్వాతి అరుణ మధుర గాండ్ల ఈశ్వర్ గురుబ్రహ్మ తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలను క్రమశిక్షణతో పెంచితే చెడు అలవాట్లకు దూరంగా ఉంటారు





సీనియర్ సివిల్ జడ్జి శైలజ ను సన్మానిస్తున్న మహిళా అధికారులు

ఆళ్లగడ్డ ప్రతినిధి మార్చి 07 విభారె న్యూస్ :- తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమశిక్షణతో పెంచితే చెడుకు దూరంగా ఉంటారని సమాజానికి ఉపయోగపడే భావిభారత తయారవుతారని ఆళ్లగడ్డ సీనియర్ సివిల్ జడ్జి శైలజ అన్నారు. గురువారం మండల లీగల్ సర్వీసెస్ ఆళ్లగడ్డ మెప్మా ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణంలో న్యాయ విజ్ఞాన సదస్సు లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల రక్షణకు అనేక చట్టాలు ఉన్నాయన్నారు. బాలురు బాలికలను ఇబ్బందులు పెట్టినా, బాలురు జైలుకు వెళ్లేలా చట్టాలు ఉన్నాయన్నారు. చట్టాల ప్రకారం దురుసుగా ప్రవర్తిస్తే బాలికల కంటే బాలురే ఇబ్బందులు పడతారన్నారు. ఈ అంశాన్ని గుర్తించి తల్లిదండ్రులు తమ పిల్లలను ఎవరితో ఎలా నడుచుకోవాలి ఎలాంటి పనులు చేయకూడదు చట్ట వ్యతిరేకంగా ప్రవర్తిస్తే ఎలాంటి ఇబ్బందులు కలుగుతాయని వారికి అవగాహన కల్పించాలన్నారు. గతంతో పోలిస్తే అన్ని రంగాలలో నేడు మహిళలు ముందు ఉన్నారన్నారు. మహిళా చట్టాల ద్వారా మహిళలు అవసరమైన సమయంలో వాటి ద్వారా రక్షణ పొందాలే తప్ప వాటిని ఆసరాగా తీసుకొని ఇబ్బందులకు గురి చేయరాదన్నారు. మహిళలు ఇంకా అనేక రంగాలలో రాణించాలని జడ్జి శైలజ ఆకాంక్షించారు. నిత్యజీవితంలో అవసరమైన చట్టాల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. న్యాయ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉచిత న్యాయ సహాయం కొరకు స్థానిక మండల న్యాయ సేవా సంఘం ఆళ్లగడ్డ వారిని ఆశ్రయించాలని జడ్జి సూచించారు. న్యాయ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని న్యాయమూర్తి శైలజ, ఆళ్లగడ్డ పట్టణ ఎస్ఐ షేక్ నగీనా, అంగన్వాడీ సూపర్వైజర్లు తదితరులను సత్కరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని న్యాయమూర్తి చేతుల మీదుగా కేక్ కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది శివరామిరెడ్డి, న్యాయవాది సోమశేఖర్ రెడ్డి, తాసిల్దార్ నజీర్ అహ్మద్, ఎంపీడీవో వెంకటరమణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు, ఐసిడిఎస్ సిడిపిఓ తేజేశ్వరి, ప్యానల్ న్యాయవాది షహినా బేగం, మెప్మా సీఎం ఎం శోభ, సి ఓ లు సుబ్బయ్య, విద్యాసాగర్, పట్టణ సమాఖ్య ప్రతినిధులు, పొదుపు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ శిరిడీ నాథ వైభవం గ్రంథావిష్కరణ చేసిన... సురేష్ బాబు.

విభారే న్యూస్ డోన్ మా ప్రతినిధి :- మార్చి 7 డోన్ పట్టణం పాతపేట జిల్లా పరిషత్‌ఉన్నతపాఠశాలయందు ప్రధానోపాధ్యాయులు పద్మావతమ్మ ఆధ్వర్యంలో శ్రీ శిరిడీ నాథ వైభవం అనే గ్రంథావిష్కరణ కార్యక్రమం చేసినట్లు నెహ్రూ నగర్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సురేష్ బాబు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నిశ్చల మనస్సుతో, చిత్తశుద్ధితో శిరిడీ సాయిని సేవిస్తే మంచి ఫలితం ఉంటుందన్నారు. ప్రగాఢమైన నమ్మకం, విశ్వాసం ఉండాలన్నారు. శ్రద్ధతో సాయిని సేవిస్తే జ్ఞాపకశక్తి పెంచుకుంటే పురోగతి సాధించవచ్చని సాయి చరిత్ర ద్వారా తెలుస్తోంది. కావున విద్యార్థులు శ్రద్ధగా చదివి మంచి ఫలితం సాధించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా వెంకట సుబ్బారెడ్డి,మల్లిక దంపతులకు శ్రీ శిరిడీ నాథ వైభవం అనే గ్రంథంను అంకితమిచ్చారు. ఈ సందర్భంగా వెంకట సుబ్బారెడ్డి దంపతులకు శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు. సుబ్బారెడ్డి ఇంటిలో సాయి సత్సంగము చేసే సమయంలో శిరిడి సాయిపై 108 పద్యాలను రచించడం జరిగిందన్నారు. వాటి తుది రూపమే నేటి ఈ గ్రంథావిష్కరణ అని తెలిపారు. ఈసందర్భంగా సురేష్ బాబు ని శాలువా కప్పి పూలమాల వేసి, నూతన వస్త్రాలను దానం చేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు శివప్రసాద్, సుబ్బారెడ్డి, వెంకటరమణ, వెంకట లక్ష్మి, రాధ, అనంత శ్రీనివాసులు,లక్ష్మయ్య, రవిశేఖర్, శ్రీనివాసులు, జయసుబ్బరాయుడు, శివన్న, ఆదినారాయణ, సురేష్, లీలావతమ్మ, దేవేంద్రప్ప, భాను ప్రకాష్ రెడ్డి, విజయకుమార్, సుభాన్, శ్రీనివాసులు, లక్ష్మి ప్రభావతి,తదితరులు పాల్గొన్నారు.




# ఎస్ బీ ఐ కాలనీలో భూమి రిజిస్ట్రేషన్ అక్రమం కాదు సక్రమమే



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 07-నంద్యాల పట్టణం ఎస్బిఐ కాలనీలో ఉన్న సర్వే నంబర్ 2313/1సి భూమి రిజిస్ట్రేషన్ అక్రమం కాదని, సక్రమమే అని కొనుగోలుదారులు మూర్తిరెడ్డి యుగంధర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నంద్యాల మున్సిపల్ పరిధిలోని ఎస్బిఐ కాలనీలోని సర్వే నంబర్ 2313/1సి భూమి రిజిస్ట్రేషన్ అక్రమం కాదని, సక్రమమేనని పేర్కొన్నారు. న్యాయపరమైన అంశాలు పరశీలించుకొని జీపీఏ హోల్డర్ నుంచి కొనుగోలు చేయడం జరిగిందన్నారు. నంద్యాల, కోవెలకుంట్ల రిజిస్ట్రేషన్ కార్యాలయంలో కంప్యూటర్లు పనిచేయకపోవడంతో బెతంచెర్ల రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్టర్ చేయడం జరిగిందన్నారు. 1986 లో హౌసింగ్ బోర్డు కాలని కోసం సేకరించిన పొలంలో మేము కొనుగోలు చేసిన పొలం అన్నదమ్ముల మధ్య వివాదం వుండేదని, గతంలో అధికారులు మూడు ఎకరాల 40 సెంట్ల భూమి వివాదంలో వుందని పొందుపరచడం జరిగిందని అన్నారు.ఇద్దరు అన్నదమ్ములు భాగ పరిష్కారాలు చేసుకోవడం కొద్ది రోజులకే వారు మరణించడంతో వారి వారసులు 2022లో రఫీఉల్లాఖన్ అలియాస్ రాయలసీమ చాంద్ జిపిఏ రిజిష్టర్ చేయించుకున్నారని, న్యాయపరమైన సమస్యలు, వివాదాలు లేవని తెలుసుకొని అతని వద్ద కొనుగోలు చేశామన్నారు. భూమి రిజిస్ట్రేషన్ ఆపే హక్కు లేదని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు క్లియర్ గా రిప్ పిటిషన్ నెంబర్ 10813/ 2022, 12720/2022 లో చెప్పిందన్నారు. కొందరు మేము కొనుగోలు చేసిన భూమి సక్రమం కాదు, అక్రమం అని ప్రచారం చేశారని పేర్కొన్నారు. మున్సిపల్ అధికారులు మా స్థలంలో దౌర్జన్యంగా బోర్డు పాతడంపై న్యాయస్థానాన్ని ఆశ్రయించామన్నారు. మేము రిజిష్టర్ చేయించుకున్న తర్వాత మూడు ఎకరాల 40 సెంట్లు స్థలం నంద్యాల మున్సిపల్ చైర్మెన్ మీద ఆన్లైన్ ఎలా చేశారని విలేఖరులు ప్రశ్నించగా, మాకు రిజిస్ట్రేషన్ తేదీ ముందు ఆన్లైన్ లో ఎవరి పేరు లేదని, ఇప్పుడు ఎలా వచ్చిందో తెలుసుకోవాల్సిన బాధ్యత అధికారులపై వుందన్నారు. నంద్యాల మున్సిపల్ కమీషనర్ ఫిబ్రవరి 16న హైకోర్టు ఉత్తర్వును వ్యతిరేకిస్తూ నంద్యాల రిజిస్ట్రార్, పోలీసులకు మాపై పిర్యాదు చేశారన్నారు. మా పేరు మీద ఉన్న దస్తావేజులు రద్దు చేసి మా పై చర్యలు తీసుకోవాలని కమిషనర్ పిర్యాదులో పేర్కొన్నారని, ఈ విషయంపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ను ఆశ్రయించడంతో రిట్ నెం. 5465/2024 లో కోర్టు దృష్టికి తీసుకొని వెళ్ళామని పేర్కొన్నారు. కోర్టు కమిషనర్ ఇచ్చిన పిర్యాదును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారని అన్నారు. మా భూమిపై మున్సిపాలిటీ కమిషనర్ కు, ఇతరులకు ఎలాంటి హక్కులు లేవన్నారు. మా హక్కులు భంగం కలిగిస్తే న్యాయస్థానం సూచన మేరకు నడుచుకుంటామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కొనుగోలుదారులు అక్బర్ బాషా, షేక్ అబ్దుల్లా, సయ్యద్ భాషాలు పాల్గొన్నారు.

# 14 నుండి వైభవంగా ప్రారంభం కానున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు





దిగువ అహోబిలం



ఎగువ అహోబిలం

ఆళ్లగడ్డ ప్రతినిధి మార్చి 07 విభారె న్యూస్ :- ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలం శ్రీ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ఈనెల 14న గురువారం నుండి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఎగువ అహోబిలం శ్రీ జ్వాల నరసింహ స్వామి, దిగువ అహోబిలం శ్రీ ప్రహ్లాద వరద స్వాములు ఇరువురు కలిసి ఉత్సవ పల్లకిలో వేంచేసి తమ కళ్యాణ ఉత్సవాలకు భక్తులను స్వయంగా ఆహ్వానించేందుకు మూడు మండలాల్లో 33 రోజులపాటు 45 గ్రామాల్లో పర్యటించారు. ఎగువ,దిగువ అహోబిలాల్లో 11 రోజులు పాటు బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతాయి. మూడు రోజులపాటు తెప్పోత్సవాలు జరుగుతాయి.ఎగువ అహోబిలంలో......ఈనెల 14న సెల్వార్ కుత్తూ,15 న అంకురార్పణ కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రాంభమనీ అవుతాయి. 16న ఉదయం ధ్వజారోహణం, రాత్రి సింహవాహన సేవ, 17న ఉదయం హంసవాహనం, రాత్రి సూర్యప్రభ వాహన సేవ, 18న ఉదయం గరుడ విమానం రాత్రి హనుమంత వాహనం, 19న ఉదయం శేష వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనం, 20న ఉదయం ఉత్సవం, రాత్రి శరభ వాహనం, 21న ఉదయం ఉత్సవం, రాత్రి పొన్నచెట్టు వాహనం, 22న ఉదయం ఉత్సవమూర్తులకు తిరుమంజనం, సాయంత్రం కల్యాణోత్సవం, 23న ఉదయం ఉత్సవం, రాత్రి అశ్వవాహన సేవ, 24న ఉదయం రథోత్సవం, 25న ఉదయం తీర్థ వారి చక్రస్నానం, సాయంత్రం ద్వాదశరాధనం, పుష్పయాగం, గరుడసేవ, ద్వజావరోహణంతో ఎగువ అహోబిలంలో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. దిగువ అహోబిలంలో......15న సాయంత్రం సెల్వార్ కూత్తూ. 16న దిగువ అహోబిలంలో అంకురార్పణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. 17న ఉదయం ధ్వజారోహణం. రాత్రి సింహ వాహన సేవ. 18న ఉదయం హంస వాహనం. రాత్రి సూర్యప్రభ వాహనం. 19న ఉదయం గరుడ విమానం. రాత్రి హనుమంత వాహనం. 20న ఉదయం శేష వాహనం. రాత్రి చంద్రప్రభ వాహనం. 21న మోహిని అలంకారం. రాత్రి శరభ వాహనం. 22న ఉదయం వేణుగోపాలన్ అలంకారం, రాత్రి పొన్నచెట్టు వాహనం, 23న ఉదయం సాయంత్రం కళ్యాణోత్సవం, 24న ఉదయం కాలింగ నర్తన ఉత్సవం, రాత్రి అస్వ వాహనం, 25న రథోత్సవం, 26న ఉదయం తీర్థ వారి చక్రస్నానం, సాయంత్రం ద్వాదశరాధనం, పుష్పయాగం, గరుడసేవ, ద్వజావరోహణంతో దిగువ అహోబిలంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా ముగుస్తాయి. 27 నుండి 29 వరకు తెప్పోత్సవాలు.....బ్రహ్మోత్సవాలు ముగియగానే 27వ తేదీ నుండి 29వ తేదీ వరకు దిగు అహోబిలంలో మూడు రోజులపాటు తిప్పోత్సవాలు వైభవంగా జరుగుతాయి. ఈ కార్యక్రమాన్ని అహోబిలం 46వ పీఠాధిపతి శ్రీ వన్ శ్రీ శతగోప రంగనాథ యతీంద్ర మహాదేశికం స్వామి ఆధ్వర్యంలో వైభవంగా జరగనున్నాయి.

## అనకాపల్లి లో చేయూత కార్యక్రమం

అనకాపల్లి,ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో భాగమైన చేయూత లబ్ధిదారులకు నాలుగో విడత లబ్ధిని అందించే కార్య క్రమాన్ని అనకాపల్లి జిల్లాలో వైసీపీ శ్రేణులు ఘనంగా నిర్వ హిస్తున్నాయి. ఎన్నికలకు ముందు జరుగుతున్న ఈ సభ ఎన్నికల శంఖా రావానికి నాంది పలుకుతుందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమ ర్నాథ్ ఇప్పటికే ప్రకటించారు. దీంతో వైసీపీ శ్రేణులు రెట్టించిన ఉత్సాహంతో ఈ సభను విజయవంతం చేయడానికి సిద్ధమవు తున్నారు. ఈ సభలో జగన్మో హన్ రెడ్డి కీలక ప్రసంగం చేయనున్నా రని పార్టీ నాయకులు విశ్లేషిస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి అమర్నాథ్ మా ట్లాడుతూ వైయస్సార్ చేయూత నాలు గో విడత కార్యక్రమంలో భాగంగా పిసినికాడలో ఏర్పాటు చేసిన సభ నుంచి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి 25 లక్షల మందికి చేయూత లబ్ధిని అందించనున్నారని చెప్పారు. ఎస్సీ ఎస్టీ బీసీ మహిళలకు ఐదు సంవత్సరాలలో సుమారు 70 వేల రూపాయల లబ్ధిని అందజేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కు తుందని అన్నారు.

## పాతపట్నం వైకాపాలో వర్గపోరు

శ్రీకాకుళం ,శ్రీకాకుళం జిల్లా పాతపట్నం నియోజకవర్గం వైసిపి లో వర్గ పోరు మరోసారి బయట పడింది.. సిట్టింగ్ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ని అభ్యర్థి గా ప్రకటిస్తే ఓడిస్తాం అంటూ ద్వితీయ శ్రేణి నాయకులు స్పష్టం చేస్తున్నారు. పాతపట్నం నియోజక వర్గం లో వైసీపీ హ్యాట్రిక్ విజయం సాధించాలంటే స్థానిక అభ్యర్థి లోతుగెడ్డ తులసి వర ప్రసాద రావు ను బరిలో దింపాలని పలువురు వైఎస్ఆర్సీపీ నేతలు,కార్యకర్తలు అధిష్టానం కి సూచించారు..వైసీపీ అభ్యర్థి ప్రకటన బట్టి తమ నిర్ణయం ఉంటుందని డెడ్ లైన్ పెట్టారు.. నియోజక వర్గం లోని కొత్తూరు లో జగన్ ముద్దు, రెడ్డి శాంతి వద్దు అంటూ ప్రత్యేకం గా సమావేశం నిర్వహించారు... ఈ సమావేశానికి నియోజక వర్గంలో 163 గ్రామ పంచాయితీ ల్లో 322 బూత్ ల నుంచి పెద్ద ఎత్తున హాజరయ్యారు.. రెడ్డి శాంతి ని మార్చండి.. ప్రకటించండి అంటూ వైఎస్ఆర్ సిపి జిల్లా కోశాధికారి లోతు గెడ్డ తులసి వర ప్రసాద రావు హితవు పలికారు.

## కడప టీడీపీ అభ్యర్థిగా వివేకా భార్య

కడప, మార్చి 7 కడప జిల్లాలో పొలిటికల్ సీన్ మారుతోంది. ప్రధానంగా వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు విపరీతంగా ప్రభావం చూపనుంది. వివేక హత్యపై ఆయన కుమార్తె సునీత న్యాయపోరాటం చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఈ హత్య కేసు విచారణలో ఎడతెగని జాప్యం జరుగుతోంది. సునీత ఆశించిన స్థాయిలో న్యాయం దక్కలేదు. దీంతో ఆమె ప్రజాక్షేత్రంలో అడుగుపెట్టారు. ఢిల్లీలో ప్రెస్ మీట్ పెట్టి ఈ కేసు వెనకాల ఉన్న కథను వివరించే ప్రయత్నం చేశారు. జగన్ సర్కార్ పై సంచలన వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఎన్నికల్లో జగన్ కు ఓటు వేయవద్దని పిలుపునిచ్చారు. దీంతో ఆ కుటుంబం నుంచి ఒకరు ప్రత్యక్ష ఎన్నికల్లో కడప నుంచి పోటీ చేస్తారని ప్రచారం ఊపందుకుంది. అందుకు తగ్గట్టుగానే పరిస్థితులు నెలకొన్నాయి. వివేక భార్య సౌభాగ్యవతమ్మకు ఎంపీ సీటు ఇచ్చేందుకు రాజకీయ పార్టీలు సీరియస్ గా ఆలోచిన్తున్నట్లు సమాచారం.గత ఎన్నికలకు ముందు వైయస్ వివేకానంద రెడ్డి దారుణ హత్యకు గురయ్యారు. రాజకీయ ప్రత్యర్థులు చేసిన పనేనంటున్నాడు ప్రచారం చేయడంతో వైసీపీకి కలిసి వచ్చింది. విపరీతమైన సానుభూతి పనిచేసింది. నాటి చంద్రబాబు సర్కార్ ఇబ్బందులను ఎదుర్కొంది. సిబిఐ విచారణకు ఆదేశించింది. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత సిబిఐ విచారణ అవసరం లేదని జగన్ తేల్చి చెప్పారు. అప్పుడే అనుమానాలు ప్రారంభమయ్యాయి. వివేక కుమార్తె సునీత ఎంటర్ అయ్యారు. న్యాయ పోరాటం చేయడం ప్రారంభించారు. సిబిఐ విచారణ సైతం ప్రారంభమైంది. కానీ అసలు నిందితులను అరెస్టు చేయడంలో జాప్యం జరిగింది. తెర వెనుక సూత్రధారులు ఉన్నారని అనుమానాలు కూడా ఉన్నాయి. అయితే దాదాపు ఐదేళ్లవుతున్న ఈ కేసు కొలిక్కి తేవడంలో సిబిఐ దారుణంగా విఫలమైంది. దీని వెనుక జగన్ హస్తం ఉన్నట్లు సునీత అనుమానించారు. అందుకే జగన్తో ప్రజాక్షేత్రంలో తేల్చుకోవాలని భావిస్తున్నారు.అయితే వివేకానంద రెడ్డి కుటుంబం షర్మిల ఆధ్వర్యంలోని కాంగ్రెస్ పార్టీలో చేరుతుందని ప్రచారం సాగింది. అయితే ఇప్పుడు వివేక భార్య సౌభాగ్యవతమ్మను కడప ఎంపీ సీటుకు పరిగణలోకి తీసుకోవాలని కడప జిల్లా నేతలు టిడిపి హై కమాండ్ కు కోరినట్లు సమాచారం. సునీత న్యాయ పోరాటం చేయడం వెనుక చంద్రబాబు హస్తము ఉన్నట్లు ప్రచారం సాగింది. ప్రస్తుతం సునీత ప్రజాక్షేత్రంలో పోరాటం చేయనున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో.. ఆ కుటుంబం ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తుందని బలమైన ప్రచారం జరుగుతోంది. అయితే కాంగ్రెస్ పార్టీలో చేరి పోటీ చేస్తే ఓట్లు దక్కుతాయో లేదో అన్న అనుమానాలు ఉన్నాయి. అదే టిడిపిలో చేరి పోటీ చేస్తే.. మంచి ఫలితం వస్తుందని ఒక అంచనా వేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే కుటుంబ వ్యవహారంలో తలదూర్చకూడదని టిడిపి భావించినట్లు తెలుస్తోంది. అటు సునీత కుటుంబం నుంచి కూడా దీనిపై స్పందన రావాల్సి ఉంది.

## శ్రీకాళహస్తి క్షేత్రంలో బ్రహ్మోత్సవం నాలుగో రోజు గంధర్వరాత్రి ఉత్సవం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు వేడుకలు శ్రీకాళహస్తి క్షేత్రంలో గంధర్వరాత్రి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ అలంకార మండపంలో అర్చక, వేద పండితులు.. జ్ఞానప్రసూనాంబ సమేత వాయులింగేశ్వరుని ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించి.. శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం మంగళ వాయిద్యాల నడుమ మహామంగళహారతి ఇచ్చి స్వామి, అమ్మ వార్లను చతుర్మాఖ మాడవీధుల్లో రావణ, మయూర , వాహనాల సేవ నిర్వహిం చారు. భక్తాగ్రేసరుడైన రావణ వాహనంపై, శ్రీకాళహస్తీశ్వర స్వామి, మయూర వాహనంపై జ్ఞానప్రసూనాంబ పుర విహారం చేశారు. విద్యుత్ దీపాల కాంతిలో జరిగిన ఊరేగింపులో భక్తులు విశేషంగా పాల్గొని స్వామి అమ్మవార్ల దివ్య మంగళ రూపాన్ని దర్శించకున్నారు.

## సకుటుంబసమేత సపరివారంగా ఫ్యాన్ క్రిందకు ముద్రగడ



కాకినాడ, మార్చి 7 మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం వైసీపీలో చేరేందుకు సిద్ధమయ్యారు. ఈ నెల 12న ఆయన వైసీపీలో చేరే అవకాశం ఉంది. ముద్రగడ ఇంటికి వైసీపీ నేత జక్కంపూడి గనేణ్ వెళ్లి చర్చలు జరిపారు. వైసీపీలో చేరాలని ఆహ్వానించారు. వైసీపీ ఎంపీ, ఉభయ గోదావరి జిల్లాల వైసీపీ రీజనల్ కోర్డినేటర్ మిథున్ రెడ్డి ముద్రగడతో ఫోన్ లో మాట్లాడారు.. వైసీపీలోకి ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో పెద్దాపురం లేదా పిఠాపురం సీట్లలో ఒక చోట ముద్రగడకు లేదా ఆయన కుటుంబసభ్యులకు అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చినట్లుగా తెలుస్తోంది. దీంతో పద్మనాభం ఓకే చేసినట్లుగా చెబుతున్నారు. ముద్రగడ పద్మనాభం జనవరి ఒకటో తేదీన భారీ విందు సమావేశం పెట్టారు. ఈ సమవేశంలో వైసీపీలో చేరుతారని ప్రకటిస్తారని అనుకున్నారు. కానీ ఆయన ప్రకటించలేదు. తర్వాత వైసీపీలో చేరేది లేదన్నారు. జనసేనలో చేరుతానని ప్రకటించారు. అయితే పవన్ కల్యాణ్ ముద్రగడ నివాసంకు వచ్చి పార్టీలోకి ఆహ్వానించే అవకాశం ఉన్నట్లుగా కొన్ని పరిణామాలు కూడా చోటు చేసుకున్నాయి. పవన్ ఇంటికి వచ్చి ఆహ్వానిస్తారని అనుకున్నా రాకపోవడతో ముద్రగడ అసంతృప్తి వ్యక్తం చేశారు. టీడీపీ ? జనసేన పొత్తులో భాగంగా జనసేన 24 అసెంబ్లీ సీట్లలో పోటీ చేస్తుంది. దీనిపై ముద్రగడ పవన్ కల్యాణ్ కు లేఖ రాశారు. జనసేన తక్కువ సీట్లు తీసుకుందన్నారు. ఈ లేఖ తరువాత పవన్ టీడీపీ ? జనసేన నిర్వహించిన సభలో మాట్లాడుతూ.. పార్టీ మద్దతు దారులు నాకు సలహాలు ఇవ్వద్దు.. నాపై నమ్మకం ఉంటే నాతో కలిసిరండి అంటూ వ్యాఖ్యానించారు. దీంతో ముద్రగడ జనసేనకు దూరమైనట్లు.. వైసీపీలో చేరుతారని ప్రచారం జరుగుతూ వచ్చింది. ఆయన వైసీపీ తరపున పిఠాపురం నియోజకవర్గం నుంచి బరిలోకి దిగుతారని, ఒకవేళ ఆయన పోటీ చేయకపోయినా ఆయన కుమారుడు పోటీ చేస్తారని వైసీపీ వర్గాలు పేర్కొంటూ వచ్చాయి. ఈ క్రమంలో పిఠాపురంర ఇంచార్జ్.. వంగా గీతను.. పిలిపించి మాట్లాడారు సీఎం జగన్. పవన్ కల్యాణ్ పోటీ చేస్తే మార్పు ఉండవచ్చని చెప్పారు. ముద్రగడ పద్మనాభం సీనియం కాపు రిజర్వేషన్ల కోసం పోరాడారు. తునిలో ఆయన నిర్వహించిన సభ ఉద్రిక్తతకు దారి తీసింది. రైలు ను కూడా తగులబెట్టారు. అయితేతర్వాత రిజర్వేషన్ల ఉద్యమాన్ని వదిలేశారు.

## చిరుత పులి భయం.. కొండ మొత్తానికి నిప్పుపెట్టిన గ్రామస్థులు

ఎమ్మిగనూరు,కర్నూలు జిల్లాలోని ఎమ్మిగనూరు మండలం గుడికల్ గ్రామ ప్రజలు దుస్సాహసానికి పూనుకున్నారు. చిరుతపులి భయంతో ఏకంగా కొండకే నిప్పుపెట్టారు. గత కొంతకాలంగా ఈ ప్రాంతంలో చిరుతపులి సంచరిస్తోంది. మేకలు, పశువుల మందపై దాడి చేస్తున్న ఘటనలు జరుగుతూ ఉన్నాయి. అయితే చిరుతను బంధించేందుకు ఫారెస్ట్ అధికారులు బోన్లను ఏర్పాటు చేశారు. ఇప్పటికే మూడువారాల క్రితం ఓ చిరుతను బంధించారు. అయితే ఇంకో చిరుత తిరుగుతోందనే భయంతో బుధవారం రాత్రి గుడికల్ గ్రామవాసులు కొండకు నిప్పుపెట్టారు.

# నీటిని వృథా చేయొద్దు

## నిరంజన్ రెడ్డి మున్సిపల్ కమిషనర్



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 07-వేసవిలో ఎదురయ్యే మంచినీటి ఎద్దడి నివా రణకు ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు మున్సి పల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి తెలిపారు. గురువారం నాడు మున్సిపల్ కార్యలయంలో కమిషనర్ మాట్లాడుతూ నీటిని వృథా చేయవద్దని పట్టణ ప్రజలకు సూచించారు . వెలుగోడు రిజర్వాయర్ నుంచి నీటిని కేసికెనాల్ ద్వారా నంద్యాల చెరువు కు మళ్లీంచడం జరుగుతున్నది. నీటిని కొందరు మోటార్ల ద్వారా మళ్లీంచడం వల్ల మంచినీటి సమస్య ఉత్పన్న మవుతుందన్నారు. మంచి నీటిని పొదుపుగా వాడి నీటి సమస్య ఉత్పన్నం కాకుండా చూడాలని ఆయన పట్టణ ప్రజలను కోరారు.

# పేదలకు మాట ఇచ్చాడు పట్టాలు పంచాడు

## కౌన్సిలర్ చంద్రశేఖర్ రెడ్డి



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 07- సీఎం జగన్ మోహన్ రెడ్డి పేదలకు మాట ఇచ్చాడని మాట ప్రకారం పట్టాలు పంపిణీ చేశారని 22 వార్డు కౌన్సిలర్ చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు .గురువారం నాడు రైతు నగరం 22 వార్డు కౌన్సిలర్ ఎన్. చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో 83 మంది పేద ప్రజలకు భేదాలకు తావు లేకుండా జగనన్న ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ జగనన్న ఇచ్చిన ఉచిత పథకాలు నవరత్నాలలో భాగంగా జగనన్న సొంత ఇంటి కల , ఇచ్చిన మాట తప్పకుండ నెరవేర్చడం జరిగిందన్నారు. జగనన్న ఇంటి పట్టాలను పొందిన పేద మహిళలు జగనన్నకు కృతజ్ఞతలు తెలిపారని ఆయన అన్నారు . ఈ కార్యక్రమంలోవీఆర్వోలు హుస్సేనయ్య,సల్మాన్, మహాలక్ష్మి,.. వెల్ఫేర్ లలిత కుమారి,. జి. ఇమ్మానుయేల్, జి. ప్రసాద్ , భద్రుడు ,వార్డ్ అడ్మిన్ హుస్సేన్ బాబు, వార్డ్ వాలంటీర్లు , మరియు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 10 వతేదిన రథోత్సవం

## 60 వేల మంది వస్తారని అంచనా

## కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆలయ కార్యనిర్వహణాధికారి





విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 07- దక్షిణ భారతం దేశంలోనే అత్యంత శక్తివంతమైన మహానంది క్షేత్రంలో శివరాత్రి సందర్భంగా లక్షలాది మంది భక్తులు దర్శించుకునే విధంగా అద్భుతమైన ఏర్పాట్లను చేశామని మహానంది క్షేత్రం కార్యనిర్వహణాధికారి కాపు చంద్రశేఖరరెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ గతంలో భక్తులు ఎదుర్కున్న సమస్యలను ఈసారి ఎదుర్కోకుండా చేశామని తెలిపారు.దేవాలయానికి అతి దగ్గరలో పార్కింగును ఏర్పాటుచేశామని దీంతోభక్తులు పెద్దగా సమస్యలు ఎదుర్కోవలసిన అవసరం ఉండదన్నారు.పది ఎకరాలలో పార్కింగ్ వసతిని కల్పించామన్నారు.వాహనపా సులను తొలగించామని అన్నారు . కోనేరు దగ్గర మహిళలకు ప్రత్యేక స్నానపు గదులు ఏర్పాటు చేశారన్నారు. భక్తులకు స్వామివారి దర్శనానికి ఏడు క్యూలైన్లు ఏర్పాటు చేశారన్నారు. వేసవి తాపం తట్టుకోవడానికి ఉచిత మజ్జిగి. తాగునీరు. లక్ష ఇరవై వేల లడ్డు భక్తులకు అందుబాటులోకి వచ్చాయి. పరిశుభ్రతకోసం 70 మంది శానిటేషన్ సిబ్బంది సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. .లింగోద్భవం (8వతేది) వేడుకలను చూడటానికి తెల్లవారుఝామున 4గంటలనుండి ప్రత్యేక లైన్లలో అనుమతి ఉంటుందని తెలిపారు. .10 వతేది రదోత్సవం 60 వేలమంది పాల్గొనే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

# బుట్టారేణుకను బారి మెజార్టీతో గెలిపించు కుందాం

## ఎర్ర కోట చెన్న కేశవ రెడ్డి ఎమ్మెల్యే





విభారె న్యూస్ ఎమ్మిగనూరు మా ప్రతినిధి మార్చి 07-. ఎమ్మిగనూరు ఎమ్మెల్యే గా బుట్టారేణుకను గెలిపిం చాలని ఎమ్మెల్యే ఎర్ర కొట చెన్న కేశవ రెడ్డి పేర్కొన్నారు. గురువారం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్సీపీ నియోజకవర్గ అభ్యర్థి బుట్టా రేణుక ను అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించేందుకు పార్టీ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని సూచించారు. పట్టణంలోని కుర్ణీ కళ్యాణ మండపంలో నందవరం మండల ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, జేసీఎస్ కన్వీనర్లను పార్టీ సమన్వయకర్త బుట్టా రేణుకకు ఆయన పరిచయం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే "ఎర్రకోట చెన్నకేశవరెడ్డి" నాయకులు,నియోజకవర్గ సీనియర్ నాయకుడు "ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి" పాల్గొన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బీసీలకు కేటాయిస్తున్నట్లు సీఎం జగన్ పేర్కొనడంతో అందుకు తాము అంగీకరించామన్నారు. ఆమె విజయానికి తాము కృషి చేస్తామన్నారు. నియోజకవర్గంలో మళ్లీ వైఎస్సార్సీపీ విజయానికి ఎమ్మెల్యే "ఎర్రకోట చెన్నకేశవరెడ్డి గారి ఆధ్వర్యంలో సమష్టిగా కృషి చేద్దామని ఎమ్మిగనూరు నియోజకవర్గ సమన్వయకర్త "బుట్టా రేణుక సూచించారు. సీఎం వైఎస్ జగన్ అమలు చేసిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఓటు వేయాలని అడుగుదామన్నారు. చంద్రబాబు హయంలో పడిన ఇబ్బందులను, జగనన్న పాలనలో జరిగిన మంచి వివరించి పారదర్శక పాలనకు మరోసారి పట్టం కట్టాలని ప్రజలను కోరుదామన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు బుట్టా శివ నీలకంఠ , మండల కన్వీనర్ బిఆర్ బసిరెడ్డి , జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీ కాంత్ రెడ్డి, ముగతి విరుపక్షి రెడ్డి, మండల నాయకులు, మండల కన్వీనర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్డీటీ సహకారంతో 60 పక్కా ఇళ్ల నిర్మాణం

## 250 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 07-నంద్యాల పట్టణం 1వ వార్డు పరిదిలోని పీవీనగర్ మరియు హరిజనవాడలో గురువారం ఎమ్మెల్యే శిల్పారవిరెడ్డి చేతుల మీదుగా ఆర్డీటీ సంస్థ ఆర్థిక సహకారం మరియు హౌసింగ్ బోర్డు లోన్ ద్వారా కట్టించిన 60 పక్కా గృహాలను లబ్దిదారులకు అందజేశారు . అలాగే హరిజవేటలో 250 మందికి దాదాపు 12.5 లక్షల విలువగల 2.5 సెంట్ల ఇళ్ల స్థలాలను లబ్ధిదారులకు పట్టాలను పంపిణీ చేయడం జరిగింది. ఆర్డీటీ ద్వారా అందిస్తున్న ఆర్థిక సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని త్వరలో ఇళ్ల నిర్మాణాలను చేపట్టాలని కోరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఎన్నో సంవత్సరాల క్రితం 1వ వార్డు పరిదిలోని హరిజనవాడ ప్రజలకు 250 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. అయితే కేటాయించిన లేఅవుట్లో ఇళ్ల నిర్మాణాలు చేయకపోవడంతో ముళ్లకంపలతో అడవిని తలపించేలాగ ఉన్న స్థలాన్ని నేడు శుభ్రం చేయించి తిరిగి రెవెన్యూ అధికారులతో లేఅవుట్ వేయించి గతంలో ఎవరికైతే ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేశారో వారికి చెందిన ఆ స్థలాలను రెవెన్యూ రికార్డుల ఆధారంగా గతంలో ఇచ్చిన రీతిగానే 250 మందికి ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. దాదాపుగా ఇవ్వబడిన ఇళ్ల స్థలాల విలువ నేడు 12.5లక్షలు ఉందని, ఈ విలువైన స్థలాలలో ఇళ్లను నిర్మించుకోవాలని కోరారు. అందుకుగాను ఆర్డీటి సంస్థ ఆర్థికసాయం అందించేందుకు ముందుకు వచ్చారని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పార్టీలను, గెలుపు ఓటములను పరిగణలో తీసుకోకుండా అందరికి న్యాయం చేయుడం జరిగిందన్నారు. హరిజనపేట అంటే శిల్పాకుటుంబం అడ్డాఅని గుర్తుకు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ మభూన్నిసా, మున్సిపల్ వైస్ చైర్మన్ పామ్ షావలి, తాహాసిల్దార్ ,దేశం సుధాకర్ రెడ్డి వార్డు వైసిపి నాయకులు మాజీ కౌన్సిలర్స్ మునయ్య, కన్నమ్మ, ఎర్రన్న ,తిమ్మరాజు, ఓబులేసు, బాబు, జయకుమార్, మధుబాబు, సాయిబాబా, బోడెన్న, అర్జున్, శేఖర్, నాగేంద్ర, మరియు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలం వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించండి

## జోన్ అధికారులను ఆదేశించిన జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి



విభారె న్యూస్ కర్నూలు మా ప్రతినిధి మార్చి 07-ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం, అష్టాదశ శక్తిపీఠం కలిసి వెలిసిన శ్రీశైల మహాక్షేత్రం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చేపట్టిన ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా అప్పగించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలని జాయింట్ కలెక్టర్ టి. రాహుల్కుమార్ రెడ్డి జోనల్ అధికారులను ఆదేశించారు. గురువారం దేవస్థానం కమాండ్ కంట్రోల్ రూమ్ లో బ్రహ్మోత్సవ ఏర్పాట్లలో భాగంగా శ్రీశైల దేవస్థానం కార్యనిర్వహణాధికారి పెద్దిరాజు, ఆత్మకూరు డి ఎస్పీ శ్రీనివాసరావులతో కలిసి అన్ని జోనల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి టి. రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గత సమావేశంలో అప్పగించిన విధులపై ఆరా తీస్తూ చేపట్టిన ఏర్పాట్లలో లోటుపాట్లను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా అన్ని సెక్టర్లలో పారిశుద్ధ్యలోపం కనిపిస్తోందని, మరింత పారిశుద్ధ్య సిబ్బందిని పెంచి షిఫ్టు పద్ధతిలో 24 గంటలపాటు పారిశుద్ధ్య పనులను ముమ్మరంగా చేపట్టాలని డి.పి.ఓను ఆదేశించారు. భక్తులకు అన్నదాన ప్రసాద వితరణ చేసే కేంద్రాల వద్ద భోజనప్లేట్లను చెత్తకుండీలలో వేసేందుకు ఏర్పాటు చేసుకోవాలన్నారు. త్రాగునీటి కోసం ఏర్పాటు చేసిన ట్యాంకుల వద్ద పాదయాత్ర భక్తులు స్నానాలు చేసి రోడ్ల మీద నీరు ప్రవహించకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేయాలని దేవస్థానం ఎగ్జిక్యూటీవ్ ఇంజనీరు మరియు సంబంధిత జోనల్ అధికారులను ఆదేశించారు. ఫాలధార ?పంచధార ? హాటకేశ్వరం ప్రదేశాలలో ఏర్పాటు చేసిన షాపులను వెంటనే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. శ్రీశైలంలోని అన్ని జోన్లలో సంబంధిత సెక్టారు అధికారులు క్షుణ్ణంగా తిరిగి పారిశుద్ధ్యం, పార్కింగు, త్రాగునీటికి ఇబ్బంది లేకుండా లోపాలను గుర్తించి మెరుగు పరుచుకోవాలన్నారు. సాక్షిగణపతి, నందిసర్కిల్, గోశాల తదితర ప్రధాన ప్రాంతాలలో భక్తులు గుమిగూడకుండా ట్రాఫిక్ చర్యలు తీసుకోవాలన్నారు. ఏ ఒక్క హోటల్లో ధరల పట్టిక కనపడడం లేదని, సాయంత్రంలోగా నిర్ణీత విక్రయ ధరల పట్టికలను తప్పనిసరిగా ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని సివిల్ సప్లై, విజిలెన్స్ అధికారులను ఆదేశించారు. అలాగే ఆహారపదర్థాల నాణ్యతపై పరిశీలించాలని ఫుడ్ సేఫ్టీ అధికారులనుఆదేశించారు. శ్రీశైలప్రధాన ద్వారం నుంచి బస్టాండ్ వరకు రోడ్ల వెంబడి తాత్కాలిక దుకాణాలు మరియు రోడ్ల వెంట అమ్ముకునే చిరు వ్యాపారస్తులు రహదారికి అడ్డం లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీస్, జోనల్ అధికారులను జెసి ఆదేశించారు. పాతాళగంగ ఘాట్ వద్ద బ్యారికేడింగును మరింత పెంచి భద్రతా చర్యలు చేపట్టాలని మత్స్యశాఖ, ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు.స్వామిఅమ్మవార్ల దర్శనార్థమై క్యూకాంప్లెక్స్, క్యూలైన్లలో వేచివుండే భక్తులకు అల్పాహారం, మంచినీటి సౌకర్యం కల్పించాలన్నారు. గురువారం రోజు లక్ష మంది భక్తులు వస్తారనే అంచనా ఉందని, మహాశివరాత్రి పర్వదినం రోజున మరింత అధికసంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని, అందుకు తగ్గ ఏర్పాట్లు చేసుకోవాలని సంబంధిత అధికారులను జెసి ఆదేశించారు. ఎక్కడ ఏ చిన్న సంఘటన జరిగినా కంట్రోల్ రూముకు సమాచారం అందించి సంబంధిత అధికారులను అప్రమత్తం చేసి సమస్యను పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు.

# వడదెబ్బకు జాగ్రత్తలు

## మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకి రెడ్డి



--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 07-ఎండలు విపరీతంగా పెరిగాయి వడదెబ్బ కు తగు జాగ్రత్తలు తీసుకోవాలని హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకి రెడ్డి పేర్కొన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయం లో ఆయన మాట్లాడుతూ నీరు, పళ్ళ రసాలు, కొబ్బరినీళ్ళు మజ్జిగ ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలన్నారు .తీవ్ర ఉష్ణోగ్రతలుండే సమయంలో ఎక్కువగా తిరగరాదు.రోడ్లవెంట విక్రయించే చల్లని రంగు పానీయాలు తాగరాదు. రోడ్లమీద అమ్మే కలుషిత ఆహారం తినరాదు. మాంసాహారం తగ్గించాలి. తాజా కూరగాయల్ని ఆహారంగా తీసుకోవాలన్నారు. మద్యం సేవించరాదని తెలిపారు. నలుపు మందంగా ఉండే వాటికి బదులు లేత రంగుల్లో లభించే తేలికైన కాటన్ దుస్తులు ధరించాలని అన్నారు .రోజు కనీసం 15 గ్లాసుల నీళ్ళు తాగాలి.పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి.ఆహారం తక్కువమోతాదులో ఎక్కువసార్లు తీసుకోవాలన్నారు. ఎండవేళ ఇంటిపట్టునే ఉండాలని సూచించారు . బయటికి వెళ్లాల్సివస్తే గొడుగు, టోపీ వంటివి తీసుకు వెళ్తే మంచిదన్నారు .ఇంట్లో కిటికీలు తెరిచి ఉంచాలి.వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడ ఉండే ప్రదేశానికి చేర్చాలని తెలిపారు. చల్లటి నీటిలో ముంచిన తడిగుడ్డతో శరీరం అంతా తుడవాలి. శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చేవరకు ఇలాగే చేస్తుండాలి.ఫ్యానుగాలి / చల్లని గాలి తగిలేలా ఉండాలి.ఉప్పు కలిపిన మజ్జిగ లేదా చిటికెడు ఉప్పుకలిగిన గ్లూకోజు ద్రావణం లేదా ఓరల్ రీ హైడ్రేషన్ ద్రావణం (ఓఆర్ఎస్) తాగించాలి. పిల్లలు, గర్భిణీలు మరియు వృద్ధులు ఎండాకాలం మరింత శ్రద్ధ తీసుకోవాలన్నారు. వడదెబ్బతగిలి అపస్మారక పరిస్థితిలో ఉన్న రోగికి నీరు తాగించకూడదు. వీలయినంత త్వరగా దగ్గరలోని ఆసుపత్రికి తరలించాలన్నారు

# పురపాలక లో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 07- నంద్యాల పురపాలక సంఘం నందు గురువారం నాడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులు గా చైర్ పర్సన్ మాబున్నీసా, శిల్పా మహిళా సహకార బ్యాంక్ చైర్మన్ నాగినిరవిసింగారెడ్డి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో పనిచేస్తున్నారని అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో మహిళలకు మంచి గుర్తింపు వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ తమీం , ఇతర ప్రజా ప్రతినిదులు, మెప్మా సీఎంఎం విజయ భాస్కర్ రెడ్డి. సిబ్బంది, పట్టణ సమాఖ్య ఓబీ లు, అర్ పి లు మరియు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు

# అహోబిలం బాచేపల్లి గ్రామాలలో పోలీసు బృందాల కవాతు...

ఆళ్ళగడ్డ ప్రతినిధి మార్చి 07 విభారె న్యూస్ :- ఆళ్లగడ్డ మండలంలోని సమస్యాత్మక గ్రామాలలో రానున్న ఎన్నికలను పురస్కరించుకొని గురువారం పోలీసులు కవాతు నిర్వహించారు. అహోబిలం, బాచేపల్లి గ్రామాలలో రూరల్ సీఐ హనుమంతనాయక్, బిఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ వరింధర్ కుమార్, రూరల్ ఎస్సై నరసింహులు ఆధ్వర్యంలో స్పెషల్ పోలీసు బలగాలు కవాతు నిర్వహించారు. రానున్న ఎన్నికల సందర్భంగా ప్రజలను అప్రమత్తం చేసేందుకు జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి ఆదేశాల మేరకు ఆళ్లగడ్డ డి.ఎస్.పి షేక్ షర్ఫుద్దీన్ పర్యవేక్షణలో పోలీస్ కవాతు నిర్వహించడం జరిగిందని సిఐ హనుమంత నాయక్ తెలిపారు. రానున్న ఎన్నికలలో ప్రజలు శాంతియుత వాతావరణం లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని రూరల్ సీఐ హనుమంత నాయక్ తెలిపారు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190